అంటాడు! అదేదో బాగా చూడు నాయనా; వెయ్యేళ్ళ పంట అన్నారు. తొందర దేనికి."

"అమ్మా, ఈ పల్లెటూళ్ళలో ఉన్న రోగమే యిది. ఒకరిని చెడగొట్టడం మరొకరికి సరదా. ఈ జబ్బు ఏదో సామాన్య జనానికి ఉంటుందేమో అనుకుంటే ఈ పెద్దవాళ్లకూడా యింతే. ఏదో ఎక్కడో వాళ్లకీ వీళ్ళకీ మాట పట్టింపు వచ్చి వుంటుంది. దాంతో ఇలా చాడీలకు తయారు. అసలు అయినా ఒకళ్లు చెప్పేది ఏముంది? వాళ్ళకున్న దేదో వుంది. అతనైనా, ఆ స్త్రీవిషయం అన్నాడేగాని ఆకుర్రవాణ్ణి గురించి యిలా అని అనలేకపోయాడు చూశావా?"

"నిజమేరా. ఇంత ఓర్వలేనితనం ఎందుకో?"

"అయితే వాళ్లు చెప్పేవన్నీ మనల్ని వినమని ఎక్కడుంది?"

"అంతేరా. ఇవన్నీ ఎందుకు - ఎలాగైనా అదే స్థిరపరచుకుంటే మంచిదిరా చంద్రశేఖరం."

"అదే నేను చూస్తున్నానమ్మా."

## 5

"ఏమవమ్మా చుక్కమ్మపాప, మీ మనమరాలు తల్లి లేకుండా మారుతల్లి కింద పడ్డంత కాలం యెన్ని యిక్కట్లు పడినా, వరాలయ్య దొరికాడంటగా - చక్కగా చిలకా గోరింకల్లా వుంటున్నారటగా?"

"అందుకే గదమ్మా, ఆ అబ్బాయే కావాలని యింతగా కోరుకున్నాం."

"అయితే ఆనాడు ఆవూరి అతడెవరూ-మాదవయ్యా, గీదవయ్యా - అతడి మాటలు వినకపోవడం చాలా మంచిది గదూ చుక్కమ్మపాపా?"

"ఓసి అమ్మాయ్- పైగా ఒక ముసలితొక్కకి యియ్యమని సాయకారాలు చెప్పొచ్చాడే."

'ఇంకొకళ్ళయితే అతడి మాటలు వింటే ఏమయ్యేదో గదా? ఇంతకూ ఆ అమ్మాయి చేసుకున్న పూజ మంచిది."

'ఏదోలే అమ్మా, పదికాలాలపాటు అట్టా సుఖంగా వుంటే మాకదే పదివేలు."

"లోకంలో ఓర్వలేనితనం - చిన్నా లేదూ, పెద్దా లేదు- ప్రతివాళ్ళకీ వుంటుంది కామాలు, చుక్కమ్మపాప? లేకపోతే పెద్దమనిషి కదా అతని కెందుకు యిట్టాంటి మాటలు?"

"దానికేంలే అమ్మాయ్. మంచిని మంచే అనుకుంటారు. చెడును చెడే అనుకుంటారు. ఇది లోకం గదా?"

# కథకుని కర్మసిద్ధాంతం

'సులోచన'

చల్లగా వీస్తోంది గాలి. మెల్లగా రేకెత్తుతున్నాయి భావాలు. కాగితం, కలం తీశాడు భాస్కరం ఓ కథ రాద్దామని. కలం కొసను పండ్ల సందున యిరికించి, తల పైకెత్తి, ఇతివృత్తం కోసం వెతుకుతున్నాడు. గతించిన జీవితంలోని మధురానుభూతుల నన్నింటినీ యిదివరకే వ్రాసి పేపర్లకు పంపించడం చేత యితివృత్త నిర్ణయం కొంచెం తామసంగా చెయ్యవలసి వచ్చింది. అలాగే కలాన్ని పండ్ల సందున యిరికించి ఏకాగ్రచిత్తంతో, ఏకాంతంలో కూర్చుని చూస్తున్నాడు భాస్కరం.

మృదువైన రెండు చేతులు తెలియకుండా అతని నయనాల్ని తాకాయి. ఇదివరకే కొంచెం చల్లటిగాలి వీస్తోండటం మూలాన కొంచెం చల్లబడ్డ చెంపలు ఆ కమనీయ హస్తాలు చెంపలను తాకడంచేత మరీ చల్లనై భాస్కరానికి ఎక్కడలేని ఆనందాన్ని చేకూర్చాయి. "ఎవరబ్బా" అనే ప్రశ్నకు జవాబు ఎంతకీ తేలకపోడంచేత ఆమె కోమలమైన చేతులను గట్టిగా నొక్కాడు. ఆమె "ఫలానా?" అని కనుగొనేందుకు అంతకంటె మంచి ఉపాయం కనిపించింది కాదు. ఎంత నొక్కినా ఆమెకు చలనం కలగకపోటంచేత కాగితం, కలం కింద పెట్టి లేచాడు. ఆ వ్యక్తి తనంత ఎత్తు లేకపోడం చేతనైతేనేమి, వదలవలసి వదలితేనేమి, మొత్తానికి వదలింది. ప్రతిక్రియగా ఆమెను పరిరంభంలోకి లాగుకొని నిర్నిద్రమైన నయనాలను, వికీర్ణమైన ముంగురులను, శోణ రుచులతో ప్రఫుల్ల

మయ్యే ఓష్ఠాలను, నిద్దంపు చెక్కిళ్ళను ముద్దాడా లనుకొన్న భాస్కరం, ఆమెను జూచిన క్షణంలోనే స్తబ్ధుడై, కౌగిలం- కలం వదలివేసి, విస విస నడుస్తో గదిలోకి వెళ్ళి తలుపు బిగించాడు.

ఆమె అతులిత సుకుమారి, అపూర్వ లావణ్యవతి...చకోరపు పులుగు. కాని భాస్కరానికి మటుకు ఆమె కిట్టదు. ఆమె లాటి సౌందర్యవతి ఆ పరిసరగ్రామాల్లో ఎవ్వరూ లేరని ప్రతీతి. కాని భాస్కరం ఆ నిర్మల సత్యాన్ని అంగీకరించినా, పూర్తిగా మటుకు అంగీకరించడు. ఏమైనా-ఆమె సర్వాంగ సౌందర్యం అన్యులెంత పొగడినా, తెగడినా ఆమెకు అప్రశ్న లేదు.కారణం? ఆమెను అసలు మనిషిగా చూడకపోటం. అతని దృష్టిలో ఆమె మనిషి కాకపోటానికామె కాదు కారణం! అతనూ కాదు.

ఆమె నుంచున్న స్థలంలో నుంచోడు. కూచున్న చోట కూచోడు. కొసకు ఆమె పడుకొన్న మంచం వంకైనా చూడడు. ఇవి భార్యాభర్తల అనుకూలదాంపత్య మని ఏ తెలివితక్కువ వాడూ అనడు. అసలు అలా అనుకోటానికి వాళ్ళ ఆచరణలో ఏ అంశమూ సహాయపడదు.

ప్రత్యహం ప్రత్యేకంగా తల్లిచేత పెట్టించుకొని తిని చక్కా వెడతాడు. ఓరోజున జరిగిందేమంటే- ఆమె అన్నం పెట్టేందుకు వంటగదిలోకి వచ్చింది. ఎంతో ఉత్సుకతతో వచ్చింది. ఆమెవచ్చింది తడవుగా లేచి మరో గదిలోకి వెళ్ళిపోయాడు. చింతనిప్పుల్లాటి నేత్రాలతో. ఈప్రత్యక్షచర్యకి ఏమాత్రమూ అక్కజపడదు. ప్రత్యహం ఉండే కొలువే కాబట్టి. భర్తతో భార్యకానీ, భార్యతో భర్తకానీ కలసి మెలసి అనురాగంతోనూ, అభిమానంతోనూ వుండటం అసహజం ఎప్పటికీ కాదు. ఆమె ఎంతో ప్రయత్నం చేస్తోంటుంది, అతనితో విలీనమవడానికి. కాని అతని నైజం తిరగబడుతుంది. ఓరోజున నీళ్ళు పోసుకుంటో "సబ్బు" అని కేకవేశాడు. ఉత్తలపడి తీసుకొచ్చి యివ్వబోయింది. ససేమిరా-ముఖం ప్రక్కకు తిప్పివేశాడు. మిక్కిలి నెంజిలితో సబ్బును అక్కడ పెట్టి వెళ్ళింది. ఆ పూట ఆ సబ్బుతో ముఖం కడుగుకొనకపోగా, దాసీదానిచేత దాన్ని వూరుకు వుత్తరంగా పారవేయించి కొత్తది కొన్నాడు. "కలసి మెలసి దాంపత్యజీవితం చేస్తోంటే, సహించలేక యితరులు 'జెలసీ' చూపిస్తోంటే, తానెంత సంతోషపడుతుంది."—వివాహానికి ముందరి కలలు; అవి యిప్పుడు కల్లలుగా తయారయాయి.

చేసేందుకు లేక, సంఘాన్ని ఎదిరించ లేక అజస్రం ఏడుస్తో కూచుంటుంది. అది భాస్కరానికి చదరంగపు ఎత్తుల్లో ఒకటిగా తోస్తోంది. "విధి"అనుకొని సగం తృప్తి పొందుతుంది.అంతకు మించి ఏం చేయగలదు? పాతివ్రత్యం...సంఘం.

భాస్కరం నడవడి తల్లికి తెలియదనుకోడం పొరబాటు. తెలియడంలోనూ గట్టిగా తెలుసు. చేసేందుకు లేక మెదలకండా వూరుకొంటుంది, తనకు ఏమాత్రం ప్రమేయం లేనట్టు. తల్లి దగ్గర ఆమె తనదుఃఖాన్ని విపులీకరించగా, ఎప్పుడన్నా కదిపితే ఒక్కపాళంగా విరుచుకు పడతాడు. అంతటితో తల్లికి అడగాలనే వాంఛ నమసి పోతుంది. ఆమె ప్రతిఅంగం అపూర్వ సౌందర్యం కలదే. కాని లోకం అనుకొన్నంత సాటిలేందిగా కనిపించదు. కారణం- ఆమెమీద భాస్కరానికున్న అశేషమైన అక్కసే. సంఘం ఆమెను పదహారణాల పతివ్రత అంటుంది. సూనృతమే. ఈ వేదాంతంతో ఆమె యౌవనం ఏంగాను? అమృతాన్ని ఆస్వాదించవలసిన ఈ వయస్సేంగాను? ఆమె అసలు జన్మించింది దేనికి? జరుగుతోంది ఏమిటి?

ప్రజల సమక్షంలో అతనికీ, ఆమెకీ పరిణయం జరిగింది. కాని ఆమెను భార్యగా స్వీకరించ నంటాడు.

"అలాగైతే అసలు పెళ్ళెందుకు చేసుకున్నావు?" అంటే-ఆప్రశ్న మటుకు తన్ను అడగరాదంటాడు. కారణంలేకపోలే దంటాడు. ఆమె అతనికి చేసిన అపకారం, వద్దన్న పనీ ఏమీ లేదు. కాని ఆమెమీద అక్కసు అనంతం. భాస్కరం ప్రవర్తన అర్థంకాక, అర్థం చేసుకోటానికి యత్నించలేక మెదలకుండా వుండేవాళ్లు, లెక్కకు మించి వున్నారు. అసలు వాళ్లను గురించి ప్రశ్నే లేదు.

చక్కని చుక్కలాటి భార్యను వదలి రాత్రులు పరస్త్రీలతో గడిపి ధనానికి ధనం,

శరీరానికి శరీరం పాడుచేసుకొంటున్నా డనే "హేయం" ఇతరత్రా సమూహాని కున్నా భాస్కరానికి మటుకు ఏ శకలంలో లేదు. మళ్లా ఓదృష్టితో చూస్తే కథకుడు. కథలు రాయడంలో అందెవేసిన చెయ్యి."ఆమె జీవితం అలాగే భగ్నం కావలసిందేనా? పతివ్రత అనే పేరుతో ఆమె యౌవనాన్ని కోల్పోవలసిందేనా? అసలు ఆమెమీద అసహ్యభావం జనించటానికి కారణం ఏమిటి? ఆమె రూపవతి కాదా? సుగుణవతి కాదా? ఏమిటి లోపం? వీటన్నిటికీ "కర్మ" అని క్లుప్తంగా జవాబు ముగించుతాడు.

అజస్రం ఆనందాన్ని ఆస్వాదించాలనే కళామూర్తి అతడు, ఆమెపట్ల మిథ్యగా నడుస్తున్నానని అత నెప్పుడూ అనుకోలేదు అనుకోటం అసత్యం. ఆమె హృదయం అకలంకం...

ఈ నాడు ఆమె భాస్కరం నేత్రాలను మూసిందంటే ధృతి అశేషం. గత జీవితంలో ఏ ఒక్క రోజూ యిలాటికార్యం ఆమె చేసి వుండలేదు. అసలు అవకాశం అనేది అవ హిల్లితేగా. అవకాశం లభించినా అందిపుచ్చుకోడానికి ఆమెకు ధృతి చాలలే దనవచ్చు. ఈనాడు ఆమె తన జీవితాన్ని ఇదమిత్థమని నిర్ణయించుకోలేక సాహసానికి విజృంభించింది. భర్తకళ్ళను భార్య మూయడం వినోదం, వేడుక. ఈమె విషయంలో మహత్తరమైన, బలవత్తరమైన సాహసకృత్యం. ఈ అల్ప కృత్యానికి కరాళ వక్త్రి మెదురైంది. ఆవేశంగా లేచివెళ్ళాడు. ఆమె తల గిర్రున తిరిగింది. సంఘం...పాతివ్రత్యం...భర్త. సినిమారీలులాగ, రైలుచక్రంలాగ తిరిగినై. తను జీవించేది దేనికి? ఏ మహత్తర ఆశయంకోసం? పాతివ్రత్యాన్ని నిలబెట్టడానికా? భర్తచేత "ఛీ" అనిపించుకోడానికా? కాదు. మరెందుకు? సంఘాన్ని ఎదిరించలేకా? శిథిలావస్థలోవున్న జీవితాన్ని బాగుపరుస్తుందా సంఘం? చెయ్యదు, ఎప్పటికీ చెయ్యదు. పైపెచ్చు అధఃపాతాళానికి తోస్తుంది! అలాటప్పుడు, ఎందుకు ఎదిరించరాదు? జీవితాన్ని అమృతతుల్యం ఎందుకు చేసుకోకూడదు?

"నేటినుండి మీరు అమృతతుల్యమైన జీవితాన్ని అనుభవించవచ్చు. అభ్యంతరం లేదు. అనుభవించుతారని ఆశించుతాను. నేను వెళ్ళిపోతున్నాను- ఈ జీవితాన్ని ఆనందప్రదం చేసుకోటానికి...అమృతాన్ని ఆస్వాదించటానికి...వినిర్మల జగత్తులో విహరించటానికి. వివాహం అయిన తరువాత మన దాంపత్య సుఖాన్ని గూర్చి తియ్యని కలలు కన్నాను. అవి తియ్యని కల్లలుగా మాత్రమే తేలాయి. ఫలానాచోటుకు వెడుతున్నానని చెప్పలేను. నే నుండి మీకు వ్యథను కల్పించడం తప్ప వేరొకటి లేదు. నేను అపూర్వ సౌందర్యవతి నే; మీరననంత మాత్రంచేత నేను అంద విహీనను కాను. మీకు నాయందు వాంఛ కలుగుతుందేమోనని యిన్నాళ్ళనుంచీ తామసం చేశాను. కాగా పోగా హేయం స్పష్ట మయింది. మీ యిచ్చ వచ్చినదానిని మళ్లా వివాహం చేసుకోవచ్చు. అయితే ఒకటి మటుకు గమనించాలి. ఆమె జీవితంకూడా నా జీవితంలాగ అయ్యేట్టు చూడకండి. మీకు నామీద అసహ్యం ప్రభూతమవడానికి కారణాలు లేకపోలేదు. మా నాన్న పొలం వ్రాసి యివ్వ లేదనే అక్కసు నా మీద చూపుతే నే నేం జేసేది? అసలు కారణం అదే అయినా, ఇవ్వని నాన్నని గాఢంగా పట్టుపట్టలేదనే కారణం లేకపోలేదు. కొడుకుండగా ఏ తండ్రి వ్రాసియిస్తాడు? అదంతా అనౌచిత్యం. నేను వెడుతున్నాను. ఎక్కడకో చెప్పలేను. ఈ తుచ్ఛసంఘాన్ని ఎదిరించి వెడుతున్నాను.మీ రేమీ కించపడవద్దు, అసలు పడరని తలుస్తాను. భార్య లేచి వెళ్ళిందంటే లేచివెళ్ళిందని చాలామంది అంటారు. దాన్ని అపవాదుగా, అప్రతిష్ఠగా తీసుకోకండి. వెడుతున్నాను- వ్యోమవీథుల్లో విహరించటానికి...అమృతాన్ని ఆస్వాదించటానికి...చెరపెట్టిన జీవితాన్ని విస్తృతం చేసుకోటానికి. ఈ పంజరంలోంచి వెళ్లిపోతున్నాను. పాతివ్రత్యం?-అది నా జీవితానికి అతకదు. నే వెళ్లిపోతున్నాను. ఎక్కడకో చెప్పలేను."

భాస్కరం వుత్తరం చదివి ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఆ నిట్టూర్పులో "వెడితే ఫర్వాలేదు" అనే నిశ్చింత ధ్వనించింది. ఏమైనా ఆమె పంజరంనుంచి విడివడింది - శేషజీవితాన్ని ఆనందప్లావితం చేసుకోటానికి. "పతివ్రత" కాదంటారా ఆమెను?